## పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న శిద్దా

**ఒంగోలు, ప్రభాతవార్త**



బాపట్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజుతో కలసి పాల్గొన్న రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్, బాపట్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా కొత్తమాసు సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కోళ్లపూడి సురేష్,ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు రావిపూడి లక్ష్మీనారాయణ, తునుగుంట్ల శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గోలపల శ్రీనివాసరావు, ఎస్.వి.ఆర్.కుమార్ పలువురు ఆర్యవైశ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మొదలైన గ్యాస్‌పై నిరసనలు

**ఉలవపాడు, మార్చి 23, ప్రభాతవార్త**




వంటగ్యాస్ సహకారంలో అందడం లేదని మండలంలోని కరేడు గ్రామంలో నిరసనలు మొదలయ్యాయి. నెలరోజుల నుండి వంట గ్యాస్ సరఫరా సక్రమంగా లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కరేడు ప్రజలు నిరసన కార్యక్రమం చేపట్టారు. గృహ వినియోగానికి ఒక సిలిండర్ 20 రోజులు మాత్రమే వస్తుందని,గ్యాస్ బుక్ చేసిన 45 రోజులు తర్వాత సిలిండర్ ఇస్తే మిగిలిన 25 రోజులు వంట ఏ విధంగా చేసుకోవాలని ప్రశ్నించారు. గతంలో లాగా కట్టెల పొయ్యి పై వంట చేసుకుందామన్న ప్రస్తుత పరిస్థితుల్లో కట్టెలు దొరికే పరిస్థితి లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం కాకుండా వంట గ్యాస్ ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కులాల చైర్మన్ మిరియం శ్రీనివాసులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పోరాడాలి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



మరవీరుడు సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఒంగోలులో కాగరాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ కలలుగన్న బలమైన భారతదేశం సాకారం కావాలంటే యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తితో నిరుద్యోగం, అవినీతి మరియు అన్యాయంపై యువత గళమెత్తాలని ఆయన కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సామాజిక మార్పు కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణానిధి మాట్లాడుతూ 23 సంవత్సరాల యవ్వన వయసులో దేశం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన వీరులు భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ లని వారి పోరాట స్ఫూర్తి దేశభక్తి నేటి యువతకు తెలియాలని వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో డ్రగ్స్ మాఫియా కు వ్యతిరేకంగా, మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని కరుణానిధి తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ ఏఐవైఎఫ్ నాయకులు కే వీరారెడ్డి, నల్లూరి మురళి, శ్రీరామ్ శ్రీనివాస్, ముతన అంజయ్య, ఏఐవైఎఫ్ నాయకులు సీతారామయ్య ఊటికొండ గోపి, మరియ బాబు, సలార్ నాయకులుతదితరులు పాల్గొని భగత్ సింగ్‌కు ఘన నివాళులర్పించారు.

## యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ 3వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి.

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




ఒంగోలులో 3వ రాష్ట్ర మహాసభల గోడ పత్రాలు ఆవిష్కరణ జరిగింది.ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజఫర్ అహమ్మద్ సిఐటి యుజిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ప్రధానకార్యదర్శి కార్యదర్శి యం.రమేష్ ముఖ్య అతిధులు గా హాజరై ఆవిష్కరించారు,అనంతరం వారు మాట్లాడుతూ "విద్యుత్ రంగ ప్రైవేటీకరణ దుష్ప్రభావాలు సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుల విలీనం లాభాలు" అనే అంశంపై సదస్సు జరుగుతుంది.కావున విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ హాజరై జయప్రదం చెయ్యాలని కోరారు. యు.టి.ఎఫ్ భవన్, ఎస్.వి.డిగ్రీ కాలేజీ దగ్గర, బాలాజీనగర్, కడప. ఏప్రిల్ 8 జరుగుతుందన్నారు. ట్రాన్స్‌కో, జెన్కో, డిస్కంలలో పనిచేస్తున్న అన్నిరకాల విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు దశాబ్దాల తరబడి విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తారన్న ఆశతో బానిసలుగా పనిచేస్తున్నారు.. స్మార్ట్ మీటర్ల వలన మీటర్ రీడర్స్, బిల్ కలెక్టర్స్, ఇంకా అనేక విభాగాలలో ఉపాధికోల్పోయే పరిస్థితి వచ్చింది. ఓపెన్ టెండర్ విధానాల వలన స్టోర్ హమాలీస్ తమ ఆదాయాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ మరియు పీస్ రే ట్ రకరకాల పేర్లతో పనిచేస్తున్న కార్మికుల్ని సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చెయ్యాలని అప్పటి వరకు కనీసవేతనం రూ.46 వేలు ఇవ్వాలని కోరారు.

## శివం పౌండేషన్ ఆధ్వర్యంలో అనాధలకు నిత్యం అన్నదానం

**- మారెళ్ళ సుబ్బారావు పుట్టినరోజు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మండవ**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం నందు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు పుట్టినరోజు వేడుకలు శివం శరణాలయంలో కేక్ కటింగ్ చేసి స్వీట్స్ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపాము. ఈ సందర్భంగా సంఘ సేవకులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ శివం పౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రతినిత్యం అన్నం పెట్టి పేదల ఆకలి తీరుస్తున్నా ఈ ఫౌండేషన్ అన్నదానానికి ధనవంతులు ద్రాతృత్వంతో ఆర్థికంగా సహకారం అందించాలని తెలిపారు. సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు మాట్లాడుతూ మారెళ్ళ సుబ్బారావు పేదలకు సేవ చేయడంలో ముందు ఉంటారని ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకొని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. బిసి సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు సినీ నటులు దన్నారపు మస్తానరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయ సహకారం అందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న మారెళ్ళ సుబ్బారావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి మాట్లాడుతూ మారెళ్ళ సుబ్బారావు అన్న శివం ఫౌండేషన్ కి వెన్నుదన్నుగా ఉంటున్నారని వారి పుట్టినరోజు సందర్భంగా శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలోని యాచకులకు ప్రభుత్వ వైద్యశాలలోని రోగుల సహాయకులకు మధ్యాహ్నం పూట పౌష్టికాహారాన్ని పంపిణీ చేశాము... మారెళ్ళ సుబ్బారావు ఇలాంటి పుట్టినరోజు మరెన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాము అని తెలిపారు., ఈ సందర్భంగా పేదలకు బియ్యము బట్టలు పంపిణీ చేశారు.,బొమ్మరిల్లు అనాధ చిన్నారుల ఆశ్రమం నందు నోట్ బుక్స్ పంపిణీ భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సేవ కార్యక్రమంలో గూడా ప్రసాద్ రెడ్డి. మండవ సుబ్బారావు. నూక తోటి శరత్ బాబు. చెన్నారెడ్డి రామయ్య మోటుపల్లి వెంకటేశ్వర్లు( చౌదరి) నైనాల వేణుగోపాల్ డాక్టర్ మొగిలి దేవ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం
వార్త
తెలుగు జాతీయ దినపత్రిక

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**కొత్తపట్నం, మార్చి 23 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం లోని భారత్ పెట్రోల్ బంక్ ఎదురు రోడ్డు ప్రమాదంలో పురిని నాగరాజు వయసు 29 సంవత్సరాలు అనే యువకుడు దుర్మరణం చెందటం జరిగింది. మృతుడికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకెళ్తే ఏపీ 26 ఏ క్యూ5824 నెంబరు గల టూవీలర్ బైక్ పై కొత్తపట్నం నుండి ఉప్పు కొట్టూరు కు వెళుతుండగా మార్గమధ్యంలో భారత్ పెట్రోల్ బంక్ ఎదురు గా ఒంగోలు నుండి కొత్తపట్నం వస్తున్న ఒంగోలు ఆర్టీసీ బస్సు ఏపీ 27 జెడ్ 0365 నెంబర్ గల బస్సు చక్రాలు అతనిపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేరినట్లు ఎస్సై వేముల సుధాకర్ తెలియజేశారు.

# మట్టి తవ్వుకో.. జేబులు నింపుకో

**- హద్దుమీరిన మట్టి దోపిడి**

**- అధికారం దోపిడికి సహకారం**





**ఒంగోలు, ప్రభాతవార్త**

తవ్వి.. సొమ్ముంతా దోచేయ్ అంటూ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వీరికి సహజ వనరులే ఆదాయ వనరులు. కొండ, గుట్ట, చెరువు మట్టిని అక్రమంగా రవాణా చేయడం వంటి వాటిలో తలపండిపోయారు. అక్రమ మట్టి తవ్వకాల్లో ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న అధికారుల ప్రేక్షక పాత్ర వెనుక ఆంతర్యమేమిటన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్టవేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. పచ్చ నేతలు అడ్డదారులు దొక్కుతున్నారు. ప్రభుత్వ భూమిలోని సహజ వనరులను దోపిడి చేస్తున్నారు. జేసీబీలను పెట్టి కొండలు, గుట్టలు, చెరువులను కరిగించి జేబులు నింపుకుంటున్నారు. దోపిడి పర్వం చేస్తున్న వారు అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు కావడంతో అడ్డుకట్ట వేసేందుకు ఏ అధికారి సాహసించడం లేదు. అధికార పార్టీ నేతలు మట్టి దోపిడి అంతా ఒక పథకం ప్రకారం సాగిస్తున్నారు. రోజు రాత్రి 7గంటల నుండి తెల్లవారుజామున 5గంటల వరకు టిప్పర్లలో మట్టిని జాతీయ రహదారి మీదుగా చెక్‌పోస్టులు దాటించి తోలుతున్నారు వందలాది ట్రిప్పుల మట్టిని టిప్పర్లు రవాణా చేసే క్రమంలో విపరీతమైన దుమ్ము లేవకుండా ఉండేందుకు కొన్ని ప్రాంతాల్లో రోజు నీటితో ఆ మార్గాన్ని తడుపుతున్నారు. సింగరాయ కొండ మండలం శానంపూడి మామిడితోటలకు ప్రసిద్ది మట్టి మాఫియా ఈ ప్రాంతంపై కన్నేయడంతో పచ్చని చెట్లు కనుమరుగైపోతున్నాయి. స్వార్థమే పరమావధిగా ఇష్టానుసారం భారీ ఎత్తున మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతుండడంతో భూగర్భ జలాలు హరించుకుపోయి పక్కనున్న తోటలను సైతం ఎండిపోయే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని యర్రజర్ల కొండ, కొణిజేడు కొండలనుంచి ఒంగోలుకు యర్రమట్టిని తరలిస్తున్నారు. ఒంగోలు నగరంలోని బ్రమర వేంచర్లతో పాటు పలు వేంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామ పరిధిలో ఉన్న యర్రమట్టితో రామాయపట్నం పోర్టు, ఇండోసోల్ కంపెనీ, బీపీసీఎల్, రిఫైనరి రాక పారిశ్రామికరణతో కావలి వరకు స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. రియల్ వెంచర్లకు మెరకు చేసేందుకు మట్టి అవసరం కానుండడంతో సింగరాయకొండ మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటుంది. పాతసింగరాయకొండలోని ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే మట్టి తవ్వకాలు సాగుతుండగా తాజాగా మరింతగా డిమాండ్ ఉండడంతో మండలంలోని శానంపూడిలో తవ్వకాలు మొదలు పెట్టేశారు. సాధారణంగా ప్రభుత్వ లేదా ప్రైవేటు భూముల్లో తవ్వకాలు సాగాలంటే రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అనుమతులు తీసుకోవాలి. ఎలాంటిఅనుమతులు లేకుండానే తమను అడ్డుకునేది ఎవరు అన్నట్లు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. నిరుపేదల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేసిన ముఠా సభ్యులు వారికి డబ్బులు ఆశ చూపి తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎకరాకు రూ.7లక్షల మేర ఇచ్చి లక్షలకు లక్షలు ఆర్జిస్తున్నారు. ఇక్కడ నుంచి మట్టిని కందుకూరు, కావలి, టంగుటూరు, నెల్లూరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి కావలికి టిప్పర్‌కు రూ.10వేలుచొప్పున వసూళ్లు చేస్తున్నారు. కందుకూరు, సింగరాయ కొండ, టంగుటూరు పరిసరాలకు తరలించాలంటే రూ.8వేలు తీసుకుంటున్నారు. రోజుకు 50 లారీలు చూసుకున్న రూ.5లక్షల మేర అర్జిస్తున్నారు. చీకటిపడిందంటే చాలు ప్రొక్లైన్‌లు పాత సింగాయకొండ, శానంపూడి, ఒగూరు వైపు మళ్ళుతున్నాయి. రాత్రి పూట లారీలను పరుగులు పెట్టిస్తున్నారు. ఒక వేళ సరుకు దూరం ప్రాంతానికి తరలించే అవకాశం లేకుంటే సింగరాయకొండలో డంప్ చేసి తెల్లారిన తరువాత దర్జాగా తరలిస్తున్నారు. లారీల రాకపోకల తో మామిడి తోటలు దుమ్ముకొట్టుకుపోతున్నాయి. పక్కనే భావి గుంతలుతవ్వేయడంతో భూగర్భ జలాలు హరించుకుపోయి మామిడి తోటలు ఎండిపోతున్నాయి. తమ పొలాల పక్కన భారీ గుంతలు ఏర్పడి నడిచేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఆరోపణలు చేసిన వారే ఇప్పుడు దందాకు తెరతీశారు. సింగరాయకొండ మండలంలో ఒక పార్టీ అధ్యక్షుడు అధికార పార్టీకి చెందిన వ్యక్తి అన్ని తానై చూసుకుంటున్నాడు. ఒంగోలు మండలం పెళ్లూరు చెరువులో అనుమతులు తీసుకున్నది కొంత, తవ్వుకునే మట్టి ఎక్కువ. అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. చెరువును అభివృద్ధి చేస్తామంటూ దరఖాస్తు చేసుకున్నారు. అక్కడ అభివృద్ధి లేకున్నా మట్టి మాత్రం రోజు తరలిపోతుంది. తవ్వకాలు, లోడింగ్ పనుల్లో ఒక వ్యక్తి కీలకంగా వ్యవహారిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో గ్రావెల్ తవ్వకాలు ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడ అనుమతి లేదన్నది భూగర్భ గనుల శాఖ మాట. ప్రభుత్వం నిర్ణయించే వరకు పర్మిట్లు ఆపేశామని చెప్తున్నా క్షేత్ర స్థాయిలో అక్రమ తవ్వకాలు సాగిపోతున్నాయి. ఇందుకు సహకరిస్తున్నది ఎవరన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజానీకం ముక్తకంఠంతో వేడుకోటుంది.

## ప్రతి వార్డులో తిరుగుతా.. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటా

**- మాజీ మంత్రి, రాష్ట్ర జనసేన నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నియోజకవర్గంలోని ప్రతి వార్డులో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటానని తాను ఎప్పటికి ప్రజల మధ్యనే ఉంటానని మాజీ మంత్రి, రాష్ట్ర జనసేన నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఒంగోలు నగరంలోని విద్యుత్ భవనం వద్ద ఉన్న కాటమరాజు విగ్రహం దగ్గర జనసేన కార్యకర్త మోదుబోయిన సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ త్వరలో ఒంగోలు నగరంలోని మురికివాడ ప్రాంతాల్లో పర్యటిస్తానని ఆయన తెలిపారు. ప్రతి జనసేన బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. జనసేన సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనసేన సభ్యత్వం తీసుకుంటున్న వారికి ఐదు లక్షలు భీమా సౌకర్యం వస్తుందని చెప్పారు. తాను ఓడిపోయినప్పటికి ప్రజల మధ్య ఉండడమే తనకిష్టమని పేర్కొన్నారు. తొలుత బాలినేని చేతుల మీదుగా మహిళకు జనసేన సభ్యత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర నాయకులు జడా బాలనాగేంద్రం అధ్యక్షత వహించారు. జనసేన రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ, తాజా మాజీ కార్పొరేటర్లు ఈదర సురేష్‌బాబు, మలగా రమేష్, యనమల నాగరాజు, జడా వెంకటేష్, వెంకటరెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, జనసేన నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారై బొడ్డు శేషారావు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు

**సంతనూతలపాడు, మార్చి 23, ప్రభాతవార్త**

పూర్వ విద్యార్థి, ఎన్నాఐ బొడ్డు శేషారావు ఆధ్వర్యంలో సంతనూతలపాడు హైస్కూల్లో 1978-79 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ కేబీ రెస్టారెంట్ నందు ఆదివారం రాత్రి ఈ ఆత్మీయ సమ్మేళన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దూర, సమీప ప్రాంతాల నుండి వచ్చిన అప్పటి పూర్వ విద్యార్థులు ముఖ్యంగా ఒకరినొకరు కలుసుకొని తమ తమ స్థితిగతులు తెలుసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఒక్కరూ పూర్వ విద్యార్థి సంతనూతలపాడు మండలం చంద్రపాలెం కు చెందిన ఎన్ఆర్ఐ బొడ్డు శేషారావును స్వయంగా కలుసుకొని తమ తమ శుభాకాంక్షలు తెలిపారు. 2028వ సంవత్సరానికి నేటి పూర్వ విద్యార్థులు పదవ తరగతి పూర్తి అయి 50 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా సంతనూతలపాడు హైస్కూల్లో గోల్డెన్‌జూబ్లీ వేడుకలు కలసుకునేలా నాటి పూర్వ విద్యార్థి సంతనూతలపాడుకు చెందిన పారిశ్రామికవేత్త కొప్పోలు రామారావు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాద్ రావు, ఎన్నారై బొడ్డు శేషారావులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులందరూ దేశ విదేశాల నుండి ఈ వేడుకలకు తరలి వచ్చేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన వేడుకల్లో పూర్వ విద్యార్థి సీనియర్ జర్నలిస్టు శిఘాకొల్లి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు కొప్పోలు రామారావు, వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, దుంపా హరినాథ్‌రెడ్డి, యద్దనపూడి శివప్రసాద్‌రావు, మందాడి వెంకటేశ్వర్లు, శిఘాకొల్లి శ్రీమన్నారాయణ, మద్దాలి రాజశేఖర్, పీవీఎల్ నరసింహారావు, సముద్రాల ఆదిమూర్తి, పమిడి తిరుపాల్, ముప్పా నారాయణ, కొంజేటి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



## జిల్లాలో జనగణన ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి: డిఆర్ఓ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




జనగణన-2027కు సంబంధించి నిబంధనలను, పద్ధతులను పూర్తిగా అవగాహన చేసుకొని జిల్లాలో జనగణన ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఫీల్డ్ ట్రైనర్స్ ను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లాలో జనగణన ప్రక్రియపై ఫీల్డ్ ట్రైనర్స్‌కు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో జనగణన ప్రక్రియ కు సంబంధించి రెండు విడతల్లో 65 మంది ఫీల్డ్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ నెల 23,24,25 మూడు రోజుల పాటు మొదటి విడతలో, ఈ నెల 26,28,29 తేదీల్లో మూడు రోజుల పాటు రెండో విడతలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ అనంతరం వీరు క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్యూమరే టర్లకు, సూపర్వైజర్ల కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో సంబంధిత అధికారులు, ఫీల్డ్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

## మీకోసం కార్యక్రమంకు 67 ఫిర్యాదులు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వివి రమణ మరియు పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం"(పిజిఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు ఫిర్యాదిదారులతో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, తక్షణ పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు అధికారులు భరోసా ఇచ్చారు.పోలీస్ అధికారులు అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఉద్యోగ మోసాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు, మరియు ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని, చట్టపరంగా చర్యలు చేపట్టడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వివి రమణ, సింగరాయకొండ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య, గుడ్లూరు ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, సంతమాగులూరు సిఐ కె.వెంకటరావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు, ప్యానల్ అడ్వకేట్ బి. బాలాజీ సింగ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘసంస్కర్త

**ఒంగోలు, ప్రభాతవార్త**



దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘసంస్కర్తని స్వాతంత్ర్య సంగ్రామంలో జాతీయోద్ధరణకు కృషి చేశారని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పేర్కొన్నారు. కోనసీమ ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సంస్కర్త, శెట్టిబలిజ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీలు శ్రీధర్‌రెడ్డి, విజయ జ్యోతి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

6_6.qxd 3/24/2026 12:00 AM Page 1



## అసలే అతివేగం.. ఆపై నిద్ర మత్తు ఉసురు తీసింది

**బల్లికురవ, మార్చి 23, ప్రభాతవార్త**



అది అద్దంకి నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారి. వాహన చోదకుడు మద్యం మత్తులో నెల్లూరు నుండి అతి వేగంగా హైదరాబాద్ వెళ్లేందుకు వస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున వాహన చోదకుడు మద్యం మత్తులో నిద్రలోకి జారేడు. ఇంకేముంది కారు ఒక్క సారిగా డివైడర్‌ను ఢీకొని ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం నెల్లూరు నుండి హైదరాబాద్ వెళ్తున్న కారు సోమవారం తెల్లవారుజామున మండలంలోని రామాంజనేయపురం వద్ద డివైడర్‌ను ఢీకొట్టి అదుపు తప్పి ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాద సమయంలో కారులో మొత్తం ముగ్గురు వ్యక్తులు ఉండగా, వారిలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో ఇరువురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు వివరించారు.

## భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి - ఏఐవైఎఫ్

**పామూరు, మార్చి 23, ప్రభాతవార్త**



రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్ సింగ్ ఆశయ సాదనకు యువత కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ అన్నారు. సర్దార్ భగత్ సింగ్ వర్ధంతిని సోమవారం భగత్ సింగ్ వీధిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో నుంచి పూర్తిగా తొలగించడం కోసం కంకణం కట్టుకుందన్నారు. గల్లీ స్థాయిలో కూడా త్యాగాలు చేయనివాళ్లను ఢిల్లీ స్థాయిలో ప్రచారం చేస్తున్నాయని ఎద్దేవ చేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వంటి వారి చరిత్రలను ప్రచారం చేయడానికి పాలక ప్రభుత్వాలు జంకుతున్నట్లు చెప్పారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువకులు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని వివరించారు. ప్రపంచంలో అమెరికా- ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ మీద పెద్ద ఎత్తున యుద్ధం చేస్తూ మారణ హోమం సృష్టిస్తున్నాయని అన్నారు. యుద్ధం విషయంలో మన దేశ ప్రధానమంత్రి మోడీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయస్సులోనే భగత్ సింగ్ తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిపెట్టారని అన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ భగత్ సింగ్ ఇచ్చిన నినాదం ఇప్పటికీ వేల గొంతల స్వరంగా మార్మోగుతుందని వివరించారు. ప్రజా భద్రత చట్టం, పారిశ్రామిక వ్యవహారాల చట్టాలు రెండు ఆనాడు ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి వచ్చాయని, వాటికి నిరసనగా భగత్ సింగ్ పార్లమెంటులో పొగబాంబు విసిరాడని గుర్తు చేశారు. దేశ భక్తికి అసలు ప్రతి రూపం భగత్‌సింగ్ అని నేటి తరం యువత భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మౌలాలి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి సుబ్బారావు, మండల సహాయ కార్యదర్శి మస్తాన్‌రావు, దస్తావేజు లేఖరి రఫీ,సీపీఐ నాయకులు వెంకటరెడ్డి, మోహన్‌రావు, దేవకుమార్, మహేష్ పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి

**యర్రగొండపాలెం, మార్చి 23, ప్రభాతవార్త**



సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలు యర్రగొండపాలెం పట్టణంలోని సీపీఐ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు. ఆయన చిత్రపటానికి వేగినాటిగంగయ్య, ఆవుల యోగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కృష్ణ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశం నుంచి బ్రిటీష్ వారు వెళ్ళిపోవాలని, భారతీయులందరికి స్వాతంత్ర్యం కావాలని పోరాడిన వీరుడు భగత్ సింగ్ అని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు, వెంకట శివయ్య, నక్కా తిరుపతయ్య, కార్పెంటర్ నాయకులు, ముఠా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం

**నాగులుప్పలపాడు, మార్చి 23, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడులోని మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నలమలుపు అంజమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రవి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలియజేశారు. మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని చెప్పారు.

## వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

**మార్టూరు, మార్చి 23, ప్రభాతవార్త**



మార్టూరు కోరిగుంట్లలోని వెంకయ్య ఆశ్రమంలో మార్టూరు వాస్తవ్యులు ఐకాన్ ఇండియా బిజినెస్ అవార్డు గ్రహీత అవిర్నేని శ్రీకాంత్(మున్నా) పుట్టిన రోజు సందర్భంగా వారి ఫ్రెండ్స్ వెంకట్(ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పీఏ), రమేష్, మధు, ఇతర మిత్రులు, కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పీఏ వెంకట్ మట్లాడుతూ ఆశ్రమానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చిన్న వయసులోనే ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న తన్నీరు రాజేష్‌ను అభినందించారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

**లింగసముద్రం, మార్చి 23, ప్రభాతవార్త**



లింగసముద్రం మండలం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాబోవు వేసవి కాలం సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీలలో తాగునీటికి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా అన్ని గ్రామ పంచాయతీలలో మంచినీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు వహించాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులను, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో పూర్ణచంద్రరరావు, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

**వెలిగండ్ల, మార్చి 23, ప్రభాతవార్త**



స్థానిక బ్యాంకు సెంటర్లో శ్రీ శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎంపీడీవో ఆర్.గంగాధర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతి రోజు చల్లని నీటిని ఫౌండేషన్ అధినేత శ్యామల కాశిరెడ్డి ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రార్థించే పదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని ఆయన కొనియాడారు. మండల టీడీపీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ శ్యామల వెంకట రెడ్డి ఫౌండేషన్ తరుపున శ్యామల కాశిరెడ్డి 14 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టారని పేదలకు ఎన్నో రకాలుగా సహాయక సహకారాలు అందిస్తుండడం సంతోషకరమన్నారు. అలాగే ప్రతి ఏడాది వెలిగండ్లలో కూలింగ్ నీళ్ల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల రైతు అధ్యక్షుడు కేసరి రమణారెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వరరెడ్డి, పిన్నిక బాలకోటయ్య, అక్కి శ్రీనివాసరెడ్డి,సుంకరి కృష్ణయ్య, మలబోతుల నాగరాజు, బొప్పరాజు లక్ష్మీనారాయణ, పోకల పుల్లారెడ్డి, బత్తుల తిరుపతిరెడ్డి, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కారంపూడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## గేదెలపై గొడ్డలితో దాడి

**రాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త**

పొలాల్లోకి గేదెలు వచ్చాయనే కారణంతో ఆ పంట పొలాల రైతులు గేదెలపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన సోమవారం జరిగింది. గౌతవరం గ్రామానికి చెందిన సూర్నేని రామారావుకు చెందిన రూ.85వేల విలువచేసే పాడి గేదెను ఎవరో రైతులు గొడ్డలితో దాడి చేసి గాయపరిచారన్నారు. నోరులేని గేదేపై కిరాతకంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు.

## దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరి కొయ్యలను ముద్దాడిన విప్లవ కెరటం భగత్ సింగ్

**సీఎస్‌పురం, మార్చి 23, ప్రభాతవార్త**

బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భరతమాల ముద్దుబిడ్డ, దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ కెరటం భగత్ సింగ్ అని యుటీఎఫ్ నాయకుడు ఇర్ల కొండయ్య అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బత్తుల జ్ఞానరాజు అధ్యక్షతన సోమవారం భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాల వయస్సులోనే బ్రిటీష్ వారి నిరంకుశ రాక్షస పాలనకు చరమగీతం పాడడానికి భగత్ సింగ్ చేసిన పోరాటం ఎనలేనిదని వక్తలు అన్నారు. వందేమాతరం నినాదం చేసేవారిని కాల్చి చంపుతున్న రోజులలో నా దేహం ముక్కలైనా నా దేశాన్ని కాపాడుకుంటానని బ్రిటీష్ దొరలకు ఎదురొడ్డిపోరాడిన భగత్ సింగ్ జీవితం భారతదేశ యువతకు స్ఫూర్తి దాయకమని అన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఊసా రాజ్యలక్ష్మీ, తిరుపతిరెడ్డి, ఎం.రత్నారెడ్డి, బక్క జేసురత్నం, ఎస్.శ్రీనివాసులురెడ్డి, ముత్యాల తిరుపతిరెడ్డి, మదన్, అంకమరావు, బాబు యేసు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తిప్రదాత

**నాగులుప్పలపాడు, మార్చి 23, ప్రభాతవార్త**




భగత్ సింగ్‌ను నేటి విద్యార్థి, యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి బి.రఘురామ్ పేర్కొన్నారు. విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ అమ్మనబ్రోలులో సోమవారం శ్రీ సాయి విద్యా నికేతన్ విజ్ఞాన భారతి హైస్కూల్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో 95వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డీవైఎఫ్ఐ నాయకులు ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘురామ్ మాట్లాడుతూ భగత్ సింగ్ త్యాగం, పోరాట పటిమ, సమాజంపై ఉన్న అవగాహనను విద్యార్థులకు వివరించారు. అలాగే మాదక ద్రవ్యాలపై సమాచారం తెలిసినప్పుడు ప్రభుత్వ వ్యవస్థలకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సాయి, కే.వెంకటకృష్ణ, వెంకటేష్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉప్పుగుండూరులో :**

ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భక్తయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హైస్కూల్ ఉపాధ్యాయురాలు సునీత అధ్యక్షతన భగత్ సింగ్ 95వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు టి.శ్రీకాంత్ మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయస్సులోనే ధైర్యంగా దేశం కోసం పోరాడారన్నారు. బ్రిటీష్ సామ్రాజ్య వాదులకు ఎదరొడ్డి నిలబడ్డారన్నారు. ప్రాణాలు పోతాయన్న లెక్క చేయకుండా దేశం కోసం నిలబడ్డారన్నారు. చిన్న వయసులోనే ఉరికొయ్య ఎక్కారన్నారు. అయినప్పటికి విప్లవం వర్ధిల్లాలని నినదించారన్నారు. పోరాటపటిమను వివరించారు. టి.శామ్యూల్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు దేశం కోసం పోరాడి బ్రిటీష్ సామ్రాజ్య వాదులకు ఎదురొడ్డి నిలబడడంతో తమ ప్రాణాలను పణంగా పెట్టారని వారిని అడుగు జాడల్లో నడవాలని విద్యార్థులకు వివరించారు. సునీత మాట్లాడుతూ కమ్యూనిస్టులు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తారని అటువంటి వారితో పాటు చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుశలేంద్రరెడ్డి, గణపతి శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు ఎన్.రామారావు, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 25వ తేదీ నాటికి నూరుశాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలి

**సీఎస్‌పురం, మార్చి 23, ప్రభాతవార్త**

ఈనెల 25వ తేదీ నాటికి నూరుశాతం ఇంటి పన్ను బకాయిలను వసూళ్లు చేయాలని డీఎల్‌డీఓ మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మండలంలోని కోవిలంపాడు పంచాయతీలో ఇంటి పన్ను బకాయిల వసూళ్ల కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. పెండింగ్ బకాయిల వసూళ్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలతో వారు సమావేశమయ్యారు. 25వ తేదీ నాటికి నూరుశాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలని పంచాయతీ రాజ్ కమీషనర్, కలెక్టర్‌లు ఆదేశించినట్లు చెప్పారు. ఇంటి పన్ను వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గిద్దలూరులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గిద్దలూరు, మార్చి 23. ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని ఎల్ఐసి ఫీడర్, నల్లబండ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల కారణంగా నేడు మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు గిద్దలూరులోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మత్తు పనుల దృష్ట్యా ఈ కోత విధిస్తున్నట్లు ఏపీసిపిడిసిఎల్ గిద్దలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. విద్యుత్ నిలిపివేత సమయంలో ప్రజలు, వ్యాపారస్తులు తమ పనులను ముందస్తుగా ప్రణాళిక వేసుకోవాలని, శాఖా పరమైన పనులకు సహకరించాలని కోరారు.

## నగర పంచాయతీ కమీషనర్ ఈవి రమణబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

**గిద్దలూరు, మార్చి 23 ప్రభాతవార్త**



గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ ఈవీ రమణ బాబుకు పుట్టినరోజు సందర్భంగా ప్రింట్ మీడియా,ఎలక్ట్రానిక్‌మీడియా మిత్రులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషనర్ ఈవీ రమణబాబు ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాల తో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు లభించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారుల బృందం

**రాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రాచర్లలోని ఏపీ మోడల్ స్కూల్/కళాశాల, రాచర్ల జడ్పీహెచ్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను జిల్లా స్క్వాడ్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులను తనిఖీ చేయడంతో పాటు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న విధానాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి సమస్యలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతుండడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

**గణితం పరీక్షకు ఐదు మంది గైర్హాజరు :**

సోమవారం జరిగిన గణితం పరీక్షకు ఐదు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. రాచర్ల జడ్పీలో ఇద్దరు విద్యార్థులు, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఒక్కరు, ఆకవీడు కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని వారు తెలిపారు.

## స్పందన వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముత్తుములకు ఆహ్వానం

**రాచర్ల, మార్చి 23, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన రాచర్లలోని స్పందన విద్యాసంస్థల 35వ వార్షికోత్సవ వేడుకలకు పాఠశాల యాజమాన్యం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి ఆహ్వానం పలికింది. ఈ మేరకు వారు వార్షికోత్సవ వేడుకల లోగోను సోమవారం గిద్దలూరులోని ఎమ్మెల్యే కార్యాలయం లో ఆయన చేత ఆవిష్కరింపజేశారు. వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ముత్తుముల పాఠశాల యాజమాన్యానికి తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ పేర్ల పరమేశ్వర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, రాచర్ల సహకార బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, కూటమి ముఖ్య నేతలు పి సనావుల్లా ఖాన్, కోరే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తురిమెళ్ళలో నేటి నుంచి శ్రీ లక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**కంభం, మార్చి 23, ప్రభాతవార్త**



కంభం మండలం తురిమెళ్ళలో కొలువైన శ్రీ లక్ష్మీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి విశ్వక్సేనా రాదన, అంకురార్పణతో ప్రారంభమై మంగళవారం ఉదయం ఆల్వార్ల పూజ, స్వప్న తిరుమంజనం, దేవతావాహనం, ధ్వజారోహణం, రాత్రి 8.45 గంటలకు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ నంద్యాల శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ మాధవ స్వామి కళ్యాణ నిర్వహించబడునని దేవస్థానం చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ బుధవారం రాత్రి శేష వాహనం, 26వ తేదీ గురువారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 27వ తేదీ శుక్రవారం రాత్రి హనుమంత వాహనం, 28వ తేదీ శనివారం రాత్రి గరుడోత్సవం, అనంతరం బెల్లంకొండ విద్యాసంస్థల వారి ఆధ్వర్యంలో అన్న సంతర్పన జరుగునని తెలిపారు. 29వ తేదీ ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి గజవాహనం, 30వ తేదీ సోమవారం రాత్రి రథోత్సవం, 31వ తేదీ మంగళవారం రాత్రి అశ్వవాహనసేవ అని తెలిపారు. అదే రోజు ప్రముఖ ప్రవచకులు టీటీడీ మరియు శ్రీశైలం తదితర ప్రముఖ దేవస్థానాల వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవచార్యులు చే శ్రీ భాగవత మహత్యం ప్రవచనం కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. 1వ తేదీ బుధవారం సాయంత్రం వసంతోత్సవంతో కార్యక్రమం ముగుస్తుందని ఆయన తెలిపారు.

## కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మోలాబి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆర్థిక సాయం

**గిద్దలూరు, మార్చి 23 ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పోతుగంటి మోలాబి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వెంటనే స్పందించారు. బాధితురాలి కుమారుడు, వికలాంగుడైన పోతుగంటి దస్తగిరిని పిలిపించి పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.అదేవిధంగా ఒంగోలులోని సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి మోలాబికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితురాలి కుమారుడు వికలాంగుడైన దస్తగిరితో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అందించిన రూ.10వేలను ఆసుపత్రి ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఏ అవసరం ఉన్నా తనను వచ్చి కలవాలని దస్తగిరికి ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా మోలాబి కుమారుడు దస్తగిరి ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్ నగర్ కాలనీ నివాసులు పాల్గొన్నారు.

## శెట్టిబలిజల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు మార్గదర్శకం : జేసీ శ్రీనివాసులు

**మార్కాపురం, మార్చి 23, ప్రభాతవార్త :**



శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మార్కాపురం కలెక్టరేట్ ప్రాంగణంలో వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలోనే శెట్టిబలిజ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పోరాడిన గొప్ప నాయకుడు వెంకటరెడ్డి అని కొనియాడారు. సమాజంలో విద్యా ప్రాధాన్యతను గుర్తించి ఆ కాలంలోనే పాఠశాలలను స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. శెట్టిబలిజ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అనేక గ్రంథాలను రచించి సమాజాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్, వెలుగొండ ప్రాజెక్ట్ ఎస్‌డీసీ శివరామిరెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి బాలు నాయక్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మహమ్మద్ ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

**రాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త**



రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే అందుకు కావలసిన సూచనలు సలహాలు తాము అందిస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. సోమవారం రాచర్ల, తదితర గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించి పంటల సాగుపై రైతులతో మాట్లాడారు. తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులపై దృష్టి సారించాలని తాము కూడా రైతులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. గత ఖరీఫ్‌లో పంటలు లాభసాటిగా లేకపోతే ఈ ఖరీఫ్ లోనైనా ఏ పంటకు ఎలాంటి దిగుబడి అని గుర్తించి పంటల క్రాప్ డైవర్సిఫికేసన్ పై దృష్టి సారించాలాన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు సద్వినియోగం చేసుకొని రైతులు లాభసాటి సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏ ఈశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుపై రైతులకు విజ్ఞాన యాత్ర

**మార్కాపురం, మార్చి 23,ప్రభాతవార్త**



ఆత్మ పథకం కింద మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతులకు సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై సాంకేతిక విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారికట్ల గ్రామంలో సేంద్రియ రైతు సుజాత క్షేత్రాన్ని సందర్శించిన రైతులు, ప్రకృతి వ్యవసాయంలో అమలు చేస్తున్న జీవామృతం, ఘనజీవామృతం, వివిధ కషాయాల తయారీ, వినియోగ విధానాలను తెలుసుకున్నారు. సుజాత రైతులకు ప్రత్యక్షంగా వివరిస్తూ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం దర్శి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన రైతులకు అక్కడి శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న నూతన వంగడాలపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి వివరించగా, కేంద్రంలో అమలు చేస్తున్న పథకాలపై డాక్టర్ రమేష్, శిక్షణ కార్యక్రమాలపై మానస రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, ఆత్మ ఏటీఎంలు, సుమారు 100మంది రైతులు పాల్గొన్నారు.

## ఆర్‌కే టెక్నోఫెస్ట్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థులదే పై చేయి

**వేటపాలెం, మార్చి 23, ప్రభాతవార్త**



ఇటీవల ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల నిర్వహించిన ఆర్‌కే టెక్నోఫెస్ట్ 2కే 26 పోటీలలో స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంబీఏ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి మొదటి బహుమతి పొందినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు మాట్లాడుతూ విజయవాడ ఇబ్రహీంపట్నంలోని ఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజీ టెక్నోఫెస్ట్ ఆర్‌కే 2 కే 26లో ఎంబీఏ విద్యార్థులు ఎం.మణికంఠ మానస్, ఎం.రాజాలు టీంగ ఏర్పడి, మార్కెట్ మేకర్స్ పోటీలలో పాల్గొని విజయంతో మొదటి బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆర్.ఇమ్మానియేల్,డాక్టర్‌సి.సుబ్బారావు,డైరక్టర్(అక్రిడిటేషన్స్),వనమా నాగసాయినాథ్,డైరక్టర్ (అడ్మినిస్ట్రేషన్), మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, అధ్యాపక బందం, విద్యార్థులు గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేశారు.

## పెట్రోల్ సంక్షోభంలో గిద్దలూరు పట్టణం

**గిద్దలూరు, మార్చి 23 ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలో మూడు పెట్రోల్ బంకులు ఉండగా రెండు పెట్రోల్ బంకులలో నో స్టాక్ బోర్డు ఒక పెట్రోల్ బంకులో మాత్రమే పెట్రోల్ ఉండటంతో గిద్దలూరు పట్టణ ప్రజలు పెట్రోల్ కోసం ఎగబడుతున్నారు. గిద్దలూరులో పలు పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూతపడి "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తున్నాయి.విషయం తెలుసుకున్న వాహనదారులు పెట్రోల్ కోసం క్యూ కట్టారు. దేశంలో ఇంధన కొరత లేదని, సరఫరా యథావిధిగా ఉందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అడ్వాన్స్ చెల్లింపుల సమస్య, సరఫరాలో అంతరాయాల వల్ల కొన్ని బంకుల్లో స్టాక్ అయిపోయిందని డీలర్లు తెలుపుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడి చమురు లభ్యతలో అంతరాయాలు ఏర్పడ్డాయని తెలుస్తోంది. వదంతులను నమ్మవద్దని, ఇంధన కొరత లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



7_7.qxd 3/24/2026 12:01 AM Page 1



## ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మార్పీఎస్

### - ఫైవ్ స్టార్ ఫైనాన్స్ దౌర్జన్యం - బాలింతపై దాడి



**సింగరాయకొండ, మార్చి 23, ప్రభాతవార్త**
ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫైవ్ స్టార్ ఫైనాన్స్ పేరుతో పేద ఎస్సీ,ఎస్టీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు.గత రాత్రి సింగరాయకొండకు చెందిన కత్తి బాలమేరి అనే మహిళపై దాడి జరిగిందని తెలిపారు. కేవలం 20 రోజుల క్రితమే ప్రసవించిన ఆమె ఇంట్లోకి అర్ధరాత్రి చొరబడి, ఫైనాన్స్ ప్రతినిధి శివ, అనుచరులు జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టినట్లు ఆరోపించారు. ఆమె భర్త సుబ్రమణ్యంపై కూడా దాడి చేసి, కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు.లోన్ల పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ. లక్ష వరకు వసూలు చేస్తూ, రిజిస్ట్రేషన్‌కు అనర్హమైన స్థలాలకు తప్పుడు పత్రాలు సృష్టించి కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడుతున్నారని విమర్శించారు. బంగినపల్లి తదితర గ్రామాల్లో వందలాది మందిని మోసం చేసినట్లు తెలిపారు.నిందితుడు శివతో పాటు ఇతర సూత్రధారులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భూ రికార్డుల ఫోర్జరీపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకిపల్లి బంగారు బాబు, రావినూతల వెంకటేష్, సూరపోగు మోజేష్, గుమ్మడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగ అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు




**సింగరాయకొండ, మార్చి 23, ప్రభాతవార్త**
మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నిందితుడిని సోమవారం సింగరాయకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాలు మేరకు మండలం లోని పాకల గ్రామంలో ఫిబ్రవరి 1 బీచ్ ఫెస్టివల్‌లో జరిగిన బైక్ దొంగతనంపై క్రైమ్ నం.25/2026గా బిఎన్ఎస్ 303(2) కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు.ఈ కేసులో బోగోలు మండలం బిట్రగుంట పరిధిలోని కప్పరాలు తిప్ప గ్రామానికి చెందిన గోగుల సునీల్ (26)ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కోర్టు నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## మల్లయ్య మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**మార్కాపురం టౌన్, మార్చి 23, ప్రభాతవార్త**
మల్లయ్య మృతికి కారణమైన టిడిపి రాష్ట్ర నాయకుడు డి.మస్తాన్ మరియు అతనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసి పులి శ్రీనివాసులుని కలిసి కాపు, బలిజ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.గత మూడు రోజుల క్రితం మార్కాపురం మండలంలోని ఇడుపురుగ్రామంలో మల్లయ్య అనుమానా స్పదంగా మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మల్లయ్య మరణానికి ముందు, ఆ వ్యక్తి ఫోన్ చేసి అతన్ని చంపేస్తానని బెదిరించిన ఆడియో ఫోన్ కాల్‌ను జేసికి వినిపించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చేసి మల్లయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాపు, బలిజ సంఘం నాయకులు అందే నాసరయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## కమర్షియల్ గ్యాస్ ఇప్పించి ఆదుకోండి



**మార్కాపురం, మార్చి 23, ప్రభాతవార్త**
కమర్షియల్ గ్యాస్ ఇప్పించి తమను ఆదుకోవాలని కోరుతూ మార్కాపురం పట్టణానికి చెందిన హోటల్స్, స్వీట్ షాప్ అధినేతలు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల వేధిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. గ్యాస్ కొరత వలన చాలా ఇబ్బంది పడుతున్నామని వారు జెసికి వివరించారు. తమకు కమర్షియల్ గ్యాస్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నటరాజ్ హోటల్ ప్రసాద్, స్పైసి రెస్టారెంట్ మధు, అభిరుచి రెస్టారెంట్ ప్రదీప్, నవరంగ్ రెస్టారెంట్ ప్రవీణ్ మరియు పట్టణంలోని హోటల్స్ యజమానులు స్వీట్ షాప్ యజమానులు ఉన్నారు.

## ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నల్స్ ఏర్పాటు పట్ల హర్షం...

### - జిల్లా ఎస్పీని కలిసి ధన్యవాదాలు తెలిపిన బిజెపి మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి



**మార్కాపురం, మార్చి 23, ప్రభాతవార్త**
నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను సమర్థవంతంగా నియంత్రించినందుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును తన కార్యాలయంలో సోమవారం బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు పోలీసులు తీసుకున్న చర్యలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మార్కాపురం జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణంలో వాహనాల రద్దీ గణనీయంగా పెరగడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సూచనల మేరకు జనవరి 5వ తేదీన మార్కాపురంలో నిర్వహించిన మొదటి గ్రీవెన్స్ కార్యక్రమంలో డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తొలి వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఆ విన్నపాన్ని సానుకూలంగా పరిగణించిన జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నలింగ్ సిస్టమ్‌ను మార్చి 16వ తేదీన పట్టణంలో ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనదారులకు సౌకర్యవంతమైన రాక పోకలు సాగుతున్నాయన్నారు.ప్రజాసమస్యల పరిష్కారంలో జిల్లా పోలీస్ యంత్రాంగం చూపుతున్న చురుకుదనాన్ని ప్రశంసించారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. అలాగే, భవిష్యత్తులో కూడా పట్టణ అభివృద్ధి దిశగా ఇలాంటి చర్యలు కొనసాగించాలని, ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్డు భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ఎస్పీని కోరారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఈ సందర్భంగా ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీని కలిసిన వారిలో రామచంద్రారెడ్డితో పాటు బీజేపీ నేతలు బాదం కిషోర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక వికాస యోధులు దొమ్మేటి వెంకటరెడ్డి

### - ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. నిర్మలామణి



**ఒంగోలు,మార్చి 23, ప్రభాతవార్త**
ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయంలో సామాజిక వికాస యోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రముఖ సంస్కర్త సామాజిక అభివృద్ధి కాంక్షకుడు వయోజన విద్యా పితామహుడు ఉద్యమకారుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఉత్సవాలు విశ్వవిద్యాలయ కళాశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నత్తల నిర్మలామణి ముఖ్యఅతిథిగా వారు మాట్లాడుతూ తుమ్మేటి వెంకటరెడ్డి సామాజిక సంస్కర్తయని గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని ఒక మనిషి జీవితంలో గొప్పతనం అంటే కేవలం సంపద కాదని పదవి కాదని సమాజానికి చేసే నిజమైన సేవా గొప్పతనం అని అటువంటి గొప్ప లక్షణాలు కలిగిన వ్యక్తి అని దుమ్మేటి వెంకటరెడ్డి అని వారి క్రమశిక్షణ త్యాగము న్యాయకత లక్షణాలు మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని ప్రబోధించారు ఈ కార్యక్రమంలో మరొక వక్త విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ వెంకటరెడ్డి విద్యా ద్వారానే వ్యక్తితో విభాసం పెంపొందించుకోవాలని విజ్ఞానవంతులు విద్యా ద్వారానే విజ్ఞానం పెంపొందించుకుంటారని జ్ఞానం అభివృద్ధి కోసం సామాజిక వికాసం కోసం నీతి నిజాయితీ కష్టపడే స్వభావము నిర్ణయం తీసుకునే దాంట్లో ధైర్యము ఈ లక్షణాలే సామాజిక వికాసం కోసం దోహదపడతాయని దుమ్మేటి వెంకటరెడ్డి యువత విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భాగస్వాములు కావాలని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్ అక్డమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ జి.రాజమోహన్ యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సోమశేఖర ఆక్వాకల్చర్ ఫ్యాకల్టీ డాక్టర్ బి సురేష్ మొదలగు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయుట జరిగింది

## 31 మందికి పది లక్షల మేరకు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, మార్చి 23, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో సోమవారం నాడు జరిగిన ఒక కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 31 మంది బాధితులకు 10 లక్షల 8 వేల 558 రూపాయలు విలువ చేసే సీఎం రిలీఫ్ చెక్కులను సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పంపిణీ చేశారు. సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన 31 మందికి ఈ సీఎం రిలీఫ్ చెక్కులను ఎమ్మెల్యే విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, తెళ్ళ మనోజ్ కుమార్, సంతనూతలపాడు మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఆళ్ల అవినాష్, బొడ్డపాటి చంద్రశేఖర్, సీహెచ్ చేజర్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వెలుగు ఏపీఎంలు



**సంతనూతలపాడు, మార్చి 23, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్‌ను సోమవారం నాడు మర్యాదపూర్వకంగా సంతనూతలపాడు నియోజకవర్గ వెలుగు ఏపీఎంలు కలిసి ఆయా శాఖల అభ్యున్నతిపై చర్చించారు. సెర్ప్ ద్వారా పొదుపు గ్రూపులో సభ్యురాలుగా ఉంటే 45 సంవత్సరాల లోపు ఉన్న పది మంది ఎస్టీమహిళలకు జీవనోపాధిని మెరుగుపరుచుకొనేందుకు 50 వేల రూపాయలు సబ్సిడీతో ఎస్టీ సబ్ ప్లాన్ నుండి ట్రై కార్‌లోన్ అర్హత కలిగిన మహిళలను నియోజకవర్గంలో గుర్తించాల్సిందిగా సెర్ప్ సీఈఓ పర్యవేక్షణలో జిల్లా వెలుగు పీడీ నారాయణ ఆదేశించారు. దీనిపై ఎమ్మెల్యే విజయ్ కుమార్‌తో ఆయా వెలుగు శాఖ అధికారులు కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమలో సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల వెలుగు ఏపీఎంలు టి.బాబురావు, కాకుమాను సుబ్బారావు, బత్తుల నరేంద్ర కుమార్, చీమకుర్తి మండల వెలుగు సీసీ వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

### - సీఐటీయు



**సంతనూతలపాడు, మార్చి 23, ప్రభాతవార్త**
భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఆయన స్ఫూర్తితో యువత డ్రగ్స్‌కు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బంకా సుబ్బారావు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్టలో భగత్ సింగ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంకా సుబ్బారావు మాట్లాడుతూ యువత ధైర్యంగా పోరాడాలని కోరారు. ఆనాటి యువ కిశోరం భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే ఉరికొయ్యని ముద్దాడి ప్రాణాలర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు దాసరి చిన్నబాబు, జూపూడి వీర నారాయణ, తుళ్లూరు సుబ్బారావు, పొత్తూరి సురేష్, ఉంగరాల రామకృష్ణ, పైడి రమేష్, రైతు సంఘం నాయకులు అన్ను వెంకట సుబ్బారావు, సామాజిక కార్యకర్త కే.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

**సంతనూతలపాడులో :**
భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి యువతను కోరారు.భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడులోని సుందరయ్య భవన్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ మండల నాయకులు తేళ్ళ ప్రభుదాసు, సీఐటీయు మండల నాయకులు పలతోటి శ్రీమన్నారాయణ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డా॥ధన్యాసి మాలకొండయ్య మృతి



**కందుకూరు మార్చి 23, ప్రభాతవార్త**
కందుకూరులో సుప్రసిద్ధ డాక్టర్ మరియు కొండపి సమితి మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ డా॥ ధన్యాసి మాలకొండయ్య(84) సోమవారం వయస్సురీత్యా కందుకూరులో మృతిచెందారు. ఆయన గత 50 ఏళ్లుగా కందుకూరు పట్టణంలో ప్రగతి నర్సింగ్ హోమ్ స్థాపించి అనేకమంది పేద ప్రజలకు వైద్య సేవలందించారు. అంతేకాకుండా మాజీ మంత్రి స్వర్గీయ దివి కొండయ్య చౌదరి ఆశీస్సులతో కొండపి సమితికి తొలి అధ్యక్షుడిగా గెలుపొంది ప్రజలకు సేవలందించారు.ఆయన మృతికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు పలువురు పముఖులు,డాక్టర్లు, రాజకీయ నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.మృతుడు ధన్యాసికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కందుకూరులో ప్రముఖ డాక్టర్ ధన్యాసి శ్రీనివాసన్ ఆయన రెండవ కుమారుడు గమనార్హం.

## భగత్ సింగ్ ఆశయ సాధనకై ప్రతిఒక్కరూ కృషి చేయాలి

### - సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫి




**మార్కాపురం టౌన్, మార్చి 23, ప్రభాతవార్త**
భగత్ సింగ్ ఆశయ సాధనకై ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫి కోరారు. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణం లోని భగత్‌సింగ్ కాలనీలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వాతంత్ర సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ వర్ధంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం డీకేఎం రఫీ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం మనం పని చేయాలన్నారు. దేశం కోసం అతి చిన్న వయసులోనే తన మరణాన్ని సైతం లెక్కచేయని మహనీయుడు భగత్‌సింగ్ అని అన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళిని అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్,మాఫియా ముఠాలపై వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు జవాజి రాజు, భగత్ సింగ్ నగర్ వాసులు హరిబాబు, బుజ్జి, సుబ్బారావు, రహమతుల్లా, పవన్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

### మోడీ 24 సంవత్సరాల నిరంతరాయ పరిపాలన పట్ల బిజెపి సంబరాలు




**మార్కాపురం, మార్చి 23, ప్రభాతవార్త**
దేశ ప్రధాని నరేంద్ర మోడీ 24 సంవత్సరాలు నిరంతరాయంగా పరిపాలించిన సందర్భంగా బిజెపి శ్రేణులు సోమవారం సంబరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్ నందు బిజెపి నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి ఏలూరు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఎటువంటి మచ్చ లేకుండా నిరంతరాయంగా సేవలు అందించి ప్రపంచంలోనే భారతదేశానికి ప్రత్యేక స్థానం సాధించిన ఘనత నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. కరోనా వంటి విపత్కర సమయాలలో చాకచక్యంగా దేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. మునుముందు కాలంలో భారతదేశాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా భారతీయ జనతా పార్టీ నడుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పివి కృష్ణారావు, మైనార్టీ రాష్ట్ర నాయకురాలు షేక్ షబానా, పొట్టి సుబ్బారావు, మద్దెల లక్ష్మీ మృదేవి, డాక్టర్ కిరణ్ కుమార్, రామకృష్ణ, యూత్ నాయకులు జీవీ రెడ్డి, బత్తుల పాలంకయ్య, అడ్వకేట్ రామచంద్ర, నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### వైఎస్ జగన్‌ను కలిసిన అశోక్ రెడ్డి

**తాళ్లూరు, మార్చి 23, ప్రభాతవార్త**
వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని పార్టీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు కైపు అశోక్ రెడ్డి సోమవారం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## కంభంలో గో సంరక్షణకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన బిజేపి నాయకులు



**కంభం, మార్చి 23 ప్రభాతవార్త**
కంభంలో గోవుల సంరక్షణకు వెంటనే శాశ్వత గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం భూమిని కేటాయించాలని కోరుతూ సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు కంభం మండల బిజెపి నాయకులు వినితిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బాదం కిషోర్ కుమార్ మాట్లాడుతూ కంభం పంచాయతీ పరిధిలో రహదారులపై నిరాశ్రయంగా తిరుగుతున్న గోవుల సంరక్షణ మరియు శాశ్వత పునరావసం కోసం తాము జాయింట్ కలెక్టర్‌ను కలిశామన్నారు. గత వారం రోజులుగా రాత్రి సమయంలో శ్రమించి ప్రమాదకరంగా రోడ్లపై ఉన్న 23 గోవులను సేకరించి వాటికి స్వచ్ఛందంగా నీరు, దాన మరియు మేతను ఏర్పాటు చేస్తున్నట్లు తాము జాయింట్ కలెక్టర్ వివరించామన్నారు. ప్రభుత్వం భూమిని కేటాయించాలని తెలిపారు. దానికి జాయింట్ కలెక్టర్ సానుకూలంగా సానుకూలంగా స్పందించిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్ర రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షులు మొనగాల వెంకట మురళీకృష్ణ, మునగాల బాలకృష్ణ, కార్యకర్తలు హరికృష్ణ, ప్రసాద్, రమేష్, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

### - జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు



**రాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త**
ప్రముఖ శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఏప్రిల్ 2 నుంచి 5వ తేది వరకు నిర్వహించనున్న ఈ బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి, షామియానాలు, విద్యుత్, వాహనాల సౌకర్యం, ఇలా ఎలాంటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదేవిధంగా రోడ్ల గుంతలను పూడ్చాలని తెలిపారు. ముఖ్యంగా తెప్పోత్సవం జరిగే గుండం దగ్గర అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైఫ్ జాకెట్లను సిద్ధం చేసి, చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా అటవీ మార్గంలో ఎలాంటి వాహనాల రద్దీ లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, డిఎంహెచ్వో వాణిశ్రీ, డీఎఫ్ఓ నిషా కుమారి, ఆలయ ఈవో నాగయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### - అధికారులకు జేసి ఆదేశం



**మార్కాపురం, మార్చి 23, ప్రభాతవార్త**
జిల్లాలో ప్రజా సమస్యలను వేగవంతంగా, సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సూక్ష్మస్థాయిలో పరిశీలించి సానుకూలంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలపై అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు న్యాయం కోసం వచ్చినప్పుడు వారి సమస్యలను వినిపించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పరిష్కరించలేని సమస్యలపై అర్జీదారులకు రాతపూర్వకంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని కూడా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 170అర్జీలు వివిధ సమస్యలపై అందినట్లు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 116, ఇతరశాఖలకు చెందిన 54అర్జీలు ఉన్నాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో పభ్రాకర్, కంభం యూనిట్ ఎస్‌డిసి శివరామిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాలాజీనాయక్, ఏపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ జెన్నమ్మ, డివిజనల్ పంచాయతీ అధికారి బాలునాయక్, మున్సిపల్ కమీషనర్ నారాయణరావు పాల్గొన్నారు.

## ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం

### జిల్లా కార్యదర్శి సీపీఐ నాయకులు వార్తికోట సంస్మణ సభ




**వేటపాలెం, మార్చి 23, ప్రభాతవార్త**
కామ్రేడ్ వార్తికోట సుబ్బారావు సంస్మరణ సభ పందిళ్ళపల్లి గ్రామంలోని నెహ్రు బొమ్మ వీధి వారి ఇంటి వద్ద సోమవారం జరిగింది. సంస్మరణ సభ వేదిక మీదకు ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ పింజల భూషణం బాబు వేదిక మీదుకు ఆహ్వానించగా, సభకు ఏఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు ఇండ్ల విజయ సారధి అధ్యక్షత వహించారు. ముందుగా వార్తికోట సుబ్బారావు చిత్రపటానికి సీపీఐ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామిపూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు మాచర్ల మోహన్‌రావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, ఏఐఎఫ్టీయు జిల్లా నాయకులు ఎంఎస్ సాయి, పింజల భూషణం బాబు, సీఐటీయు నాయకులు బాబురావు, సీపీఎం నాయకులు వసంతరావు, సీపీఐ నాయకులు కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి మాట్లాడుతూ సుబ్బారావు చిన్న తనం నుండి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలకు తోడ్పడుతూ ఉండేవాడని, ప్రజల సమస్యల కొరకు చేనేత కార్మికుల హక్కుల , సమస్యల కొరకు అనేక పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు. 2014-16 మాజూరి పోరాటంలో పందిళ్ళపల్లి నుండి ఈపురుపాలెం వరకు అనేక సమావేశాలు వేసి నిరంతరం కృషి చేశారని అన్నారు. మనమందరం నిరంతరం చైతన్యమవుతూ దోపిడి రహిత సమాజం కోసం పోరాటమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, ప్రజా తంత్ర చేనేత కార్మిక సంఘం ఆష్ట నాయకులు కూరపాటి కోటేశ్వఆవు, ఏఐఎఫ్టీయు జిల్లా నాయకులు ఎంఎస్ సాయి, సీఐటీయు నాయకులు బాబురావు, సీపీఐఎం నాయకులు వసంతరావు, సీపీఐ నాయకులు కృష్ణారెడ్డి, పల్లపోగు నాగమనోహర్, లోహియా తదితరులు సుబ్బారావుతో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తూ జోహార్లు అర్పించారు.

**శ్రీ మాల్యాద్రి లక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానం**
**మాలకొండ గ్రామం వలేటివారిపాలెం మండలం, ప్రకాశం జిల్లా,**

సీల్డ్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నం ఎ1/86,  తేది 23.03.2026

202627 సంవత్సరమునకు సంబంధించి తేది.01.04.2026 నుండి తేది:31.03.2027 వరకు ఒక సంవత్సర కాలపరిమితికి ఈ క్రింది తెలిపిన ఐటములకు తేది 29.03.2026 ఆదివారము ఉదయం 11.00 గంటలకు సదరు దేవస్థానము కొండపైన గల కళ్యాణమండపము నందు ఉప కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి వారిచే సీల్డ్ టెండరు తెరువబడును.

| వ.నం. | సీల్డు టెండరు పాటవివరము | చెల్లించవలసిన ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | అన్నదానము కొరకు పాలు మరియు పెరుగు సప్లయ్ చేయుటకు | 10,000/- |
| 2. | ఎలక్ట్రికల్ మరియు వాటర్ పైపు లైను సామానులు | 10,000/- |
| 3. | దేవాలయమునకు ఆఫీసుకు అవసరమైన స్టేషనరి | 10,000/- |
| 4. | ఆవు పేడ (ఎరువు) ప్రోగుచేసుకోను లైసెన్సు హక్కు | 10,000/- |

టెండరు షెడ్యూల్స్ తేది:24.03.2026 నుండి 28.03.2026 సాయంకాలము 4.00గంటల వరకు మాలకొండలోని దేవస్థాన కార్యాలయమునందు ఇవ్వబడును. టెండర్లను తేది 29.03.2026 ఉదయం 10గంటల లోపు మాలకొండలోని దేవస్థాన కార్యాలయము వద్ద గల టెండరు బాక్స్ నందు దాఖలు చేయవలెను.ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయ పనివేళల యందు సంప్రదించ గలరు.

ఉప కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి
సెల్: 9491000732

# మంగళగిరి శిక్షణలో పీసీపల్లి టీడీపీ నేతలు

## - గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యం



**కనిగిరి, మార్చి 23, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌బాబు సారథ్యంలో మంగళగిరిలో టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌లో నిర్వహిస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జీల ట్రైనింగ్ కార్యక్రమంలో సోమవారం కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి పరిధికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు. కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీఅధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి నియోజకవర్గానికి చెందిన పీసీపల్లి పరిధిలోని క్లస్టర్ఇన్‌చార్జిలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పులి ప్రతాప్ రెడ్డి, ఏనుగంటి నాగేంద్రబాబు తదితరులు పాల్గొని పార్టీ బలోపేతానికి అవసరమైన మార్గదర్శకాలను తెలుసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

# పొతకమూరి మస్తాన్‌సాహెబ్ వర్ధంతి సందర్భంగా అన్నదానం

## - స్నేహహస్తం ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు





**కనిగిరి, మార్చి 23, ప్రభాతవార్త**

పొతకమూరి మస్తాన్ సాహెబ్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు మహమ్మద్ రహిమాన్, ఆర్టీసీ నజీర్ అహ్మద్ సోమవారం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్నేహహస్తం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులు, అనాధలకు భోజనం ఏర్పాటు చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ సాహెబ్ చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రతి సంవత్సరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ కార్యక్రమం ఎంతో ఆదరణగా మారిందన్నారు. భోజన వసతి లేక ఇబ్బందులు పడుతున్న పేదవారికి ఈ సేవ ఉపశమనం కలిగిస్తోందని చెప్పారు. పేదవారికి ఆహారం అందించడం ద్వారా అపారమైన ఆనందం కలుగుతుందని, చిన్న సహాయం కూడా ఎంతో మందికి ఆశను ఇస్తుందని తెలిపారు. ఈ రోజు భోజన వసతి కల్పించినదాతలను అభినందిస్తూ ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది స్నేహహస్తం సభ్యులు అక్బర్ వలి, మీరా మొహిద్దిన్, చెన్నారావు, కిషోర్‌బాబు, మెర్లిన్, కాశీం పీరా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బ్రహ్మణ యువజన కార్యదర్శిగా సంగరాజు సాయి మనోజ్ ప్రమాణ స్వీకారం

## - ఉగాది పురస్కారాలు ఘనంగా ప్రధానం



**కనిగిరి, మార్చి 23, ప్రభాతవార్త**

విజయవాడ సత్య నారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్‌లో రాష్ట్ర అధ్యక్షులు కోనూరి సతీష్ శర్మ అధ్యక్షతన నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా కనిగిరికి చెందిన సంగరాజు సాయి మనోజ్‌ను జాతీయ బ్రాహ్మణ యువజన కార్యదర్శిగా నియమించగా, జాతీయ బ్రాహ్మణ ఉపాధ్యక్షులు పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు కోనూరి సతీష్ శర్మ ఆధ్వర్యంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలువురు ప్రముఖులకు నంది అవార్డులు, ఉగాది పురస్కారాలు ప్రధానం చేశారు. కనిగిరి పట్టణానికి చెందిన బ్రాహ్మణ కళ్యాణ సదన్ చైర్మన్ దూళిపాళ్ళ వీరభద్రరావుకు ఉగాది పురస్కారం రాష్ట్ర అధ్యక్షులు సతీష్ శర్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచవరం రమేష్, వాలిచర్ల మధుసూదన్‌రావు, గోపాలుని శ్రీనివాసరావు, అంబరేష్, తదితరులు పాల్గొన్నారు.

# కేవీకేలో శాస్త్రీయ సమావేశం మండలి సమావేశం





**దర్శి, మార్చి 23, ప్రభాతవార్త**

శాస్త్రీ సలహా మండలి సమావేశం సందర్భంగా కేవీకేలో ఎగ్జిబిషన్ కం సేల్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ పంటల రకాల విత్తనాలు, వాల్యూ ఎడిషన్ ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్లో ఉంచడం జరిగింది. వీటిని శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి హాజరైన అతిధులు, వివిధ అనుబంధ రంగాల అధికారులు, రైతులు ఎగ్జిబిషన్ సందర్శించారు. 2026వ శాస్త్రీయ సలహామండలి సమావేశం డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గా ప్రసాద్, సహ పరిశోధన సంచాలకులు గుంటూరు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విస్తరణ సంచాలకులు ప్రతినిధిగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.విశాలాక్షి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ జి.రమేష్ 2025-26 వ సంవత్సరంలో సాధించిన ప్రగతిని ప్రజెంటేషన్ రూపంలో హాజరై సలహా మండలి సభ్యులకువివరించారు. అదే విధంగా రాబోయే 2026-27 సంవత్సంలో చేపట్టబోయే కార్యచరణ ప్రణాళికను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిధిగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.విశాలాక్షి పలు సూచనలు, సలహాలు తెలిపారు. అనంతరం శాస్త్రీయ సలహా మండలికి హాజరైన ముఖ్య అతిధులు అనుబంధ రంగాల అధికారులు కేవీకేలో చేపట్టిన ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పి.సంధ్యారాణి, డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ టి.మానస, వివిధ అనుబంధ రంగాల అధికారులు డాక్టర్ ఎం.ఠాగూర్ నాయక్, కే.రాధా,డాక్టర్ ఎం.రవి వెంకన్న బాబు, పురుషత్తం, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# దుర్వాసనతో ప్రజలకు తప్పని ఇబ్బందులు

## - సైడు కాలువలలో ఎక్కడి చెత్త అక్కడే

## - పట్టించుకోని మండల స్థాయి అధికారులు



**ముండ్లమూరు, మార్చి 23, ప్రభాతవార్త**

మండలంలోని మారెళ్ళ గ్రామంలో సైడు కాలువలో చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. బీసీ కాలనీ సైడు కాలువలో మురుగునీరు చెత్త పేరుకుని పోయింది. దోమలు విపరీతంగా ఉన్నాయి. వాటి వల్ల పిల్లలకు జ్వరాలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో పని చేసే సిబ్బందికి అలాగే గ్రామ సెక్రటరీకి ఫిర్యాదు చేయడం జరిగిందని ఎవరు పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారంనుతొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎపి ఆర్థిక స్థితిపై రాజ్యసభలో వైవి అందోళన

## - 22 నెలలో 3లక్షలకోట్లకుపైగా అప్పులు

## - అప్పులపై కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణ వుంచాలి



**అద్దంకి , మార్చి 23, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం 22నెలల కాలంలో 3లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందిని, ఎపి ఆర్థిక పరిస్థితిపై రాజ్యసభలో మాట్లాడిన వైవి సుబ్బారెడ్డి, ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయకుండా, ఎపి ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేస్తుందని,భవిష్యత్తు తరాలను ప్రమాదంలో పడవేసే పరిస్థితులను కల్పిస్తుందని, ఆయన అన్నారు. అప్పులతో సరియైన ఫలితాలు వస్తున్నాయా లేదా అనేది పరిశీలన జరగాలని అన్నారు. అప్పులను వినియోగించి, అభివృద్ధి చేస్తున్నారా, అనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అప్పులపై కఠినమైన పర్యవేక్షణ వుంచాలని ఆయన రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అద్దంకిలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి



**అద్దంకి ,మార్చి 23, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం అద్దంకి పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు అవసరమైన మౌళిక వసతులపై వైద్యులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా రోగులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని మంత్రి సూచించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట స్థానిక వైద్యులు, అధికారులు వున్నారు.

# అద్దంకిలో 65 లక్షలతో ఏఆర్టీ భవనం

## - 3.50కోట్లతో టౌన్ హాల్ నిర్మాణం

## - ఆయా పనులను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి

## - అధికారులకు పలు సూచనలు





**అద్దంకి , మార్చి 23,ప్రభాతవార్త**

అద్దంకి పట్టణానికి మంజూరు అయిన ఎఆర్‌టి, డయాలిస్ కేంద్రాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 65 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఏఆర్టీ భవనాన్ని త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. రోగులకు అవసరమైన సదుపాయాలను తక్షణమే కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో యుద్ధ ప్రాతిపదికన 10 బాత్రూమ్‌ల నిర్మాణం చేపట్టాలని మంత్రి సూచించారు. అదే విధంగా భవానీ సెంటర్‌లో 3.50కోట్ల వ్యయంతో నిర్మాణంలో వున్న టౌన్ హాల్ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగంగా జరగాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని మంత్రి అధికారులను అదేశించారు. ఈ పరిశీలనలో మంత్రి వెంట పలువరు అధికారులు వున్నారు.

# అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం

## - డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా పోరాడుదాం

## - డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య





**దర్శి, మార్చి23, ప్రభాతవార్త**

భగత్ ఇంగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం దర్శిలోని ఎస్‌వీఆర్ హైస్కూల్, ప్రశాంత హైస్కూల్ నందు భగత్ సింగ్ చిత్రపటానికి మాజీ డీవైఎఫ్ఐ నాయకులు సందు వెంకటేశ్వరరావు, ప్రశాంత స్కూల్ డైరక్టర్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ 1907వ సంవత్సరం సెప్టెంబర్ 27న పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా గ్రామంలో జన్మించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి 23 సంవత్సరాల వయసులోనే ఉరి కంబాన్ని ముద్దాడిన వ్యక్తి భగత్ సింగ్ అని ఆయన అన్నారు. నేటి సమాజంలో నిరుద్యోగం విపరీంగా పెరిగిపోయిందని డ్రగ్స్, గంజాయి మాదక ద్రవ్యాలకు నేటి యువత దూరంగా ఉండాలని ఆయన అన్నారు. మాజీడీవైఎఫ్ఐ నాయకులు సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిఏక విధానాల వల్ల రోజు రోజుకి ప్రజలకు భారాలు పెరిగిపోతున్నాయని ప్రధానంగా నిరుద్యోగం, డ్రగ్స్ గంజాయి దేశంలో తాండవం చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు పరం చేయడం జరుగుతుందని చదువుకున్న యువతకు సరైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్లి బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాబట్టి అమర వీరుల స్ఫూర్తితో భవిష్యత్తులో నిరుద్యోగం డ్రగ్స్ గంజాయిపై యువతను చైతన్యవంతం చేస్తూ వాటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు డ్రగ్స్‌కి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆర్.జేస్సీపాల్, నాయకులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

## - వేసవిలో నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

## - ప్రజా వినతుల పరిశీలన

## - అధికారులకు మంత్రి పలు సూచనలు





**అద్దంకి , మార్చి 23, ప్రభాతవార్త**

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు త్రాగునీరు, విద్యుత్ పరంగా సమస్యలు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను అదేశించారు. సోమవారం అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని, అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాలని మంత్రి అదేశించారు. ముందుగానే అధికారులు, ఎక్కడైన సమస్యలు నీటిపరంగాని, విద్యుత్‌పరంగాని, తదితర అసరాల విషయంలో పరిశీలన చేసి, ముందస్తు చర్యలను చేపట్టాలని మంత్రి సూచించారు. అద్దంకి పట్టణంలో జరుగుతున్న సిసి రోడ్లు, సైడ్ డ్రైన్‌ల పనులు సక్రమంగా, సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని మంత్రి సూచించారు. అలాగే స్వచ్ఛ్ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్యపనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అదేశించారు. అనంతరం ప్రజల నుండి పలు వినతులను గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని అన్నీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం


**అద్దంకి , మార్చి 23, ప్రభాతవార్త**

స్వాతంత్ర విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, అమర వీరులైన వారి వర్ధంతి కార్యక్రమాన్ని రోటరీ కార్యాలయంలో లో సోమవారం సాయంత్రం 6 గంటలకు జరిగింది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న లాలా లజపతిరాయ్‌ని కాళ్లతో తొక్కి చంపటం, దానితో అగ్రహాలు ఆవేశానికి లోని యువకులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవులు పార్లమెంట్ భవనం మీద బాంబులు వేయటం ఆ దాడిలో బ్రిటిష్ గవర్నర్ ఒకరు చనిపోవడం జరిగింది. అవిషయంలో అసలు దోషి తప్పించుకోవడం జరిగింది. తదుపరి బ్రిటిష్ ప్రభుత్వం వీరిని ఉరి తీయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పువ్వాడ రామకోటేశ్వరరావు ,ఊటుకూరు రామకోటేశ్వరరావు మహమ్మద్ రఫీ, అమ్జాద్ భాష ,చప్పిడి వీరయ్య ,ఉబ్బ దేవపాలన, లేవి ప్రసాద్ ,మహాలక్ష్మి రెడ్డి , పసుపులేటి ఆంజనేయులు, తదితరులు హాజరై ఘనంగా నివాళులర్పించారు.



## శ్రీశైలంలో ప్రదోష వేళ..

# భక్తి పరవశంలో నిండే క్షణాలు



**పెద్దదోర్నాల, మార్చి 23, ప్రభాతవార్త**

శ్రీశైలంలో ప్రదోష కాలానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని పండితులు, పురోహితులు పేర్కొంటున్నారు. ప్రతిపక్షంలో వచ్చే త్రయోదశి రోజున సాయంత్రం సంధ్యా సమయాన్ని ప్రదోషకాలముగా భావిస్తారు. ఈ సమయంలో శివుడు స్వయంగా ఆలయ పరిసరాలలో విహరిస్తాడని భక్తు విశ్వాసం. ప్రదోష వేళలో ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నంది వాహన సేవలు, భక్తులను ఆధ్యాత్మిక లోకానికి తీసుకెళ్తాయి. ఈ సమయంలో దర్శనం చేసుకున్న వారికి పాప విమోచనం కలిగి, శుభ ఫలాలు సిద్ధిస్తాయని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మల్లిఖార్జున స్వామి వారి దర్శనం అత్యంత పుణ్య ప్రదమని విశ్వసిస్తున్నారు. స్థానిక పురోహితుల ప్రకారం ప్రదోష సమయంలో శివుడు నందిపై విహరిస్తూ భక్తులకు ఆశీర్వాదం అందిస్తాడనే నమ్మకం ఎంతో పురాతనమైంది. అందుకే ఈ వేళలో వేలాది మంది భక్తులు శ్రీశైలానికి చేరుకుని ప్రత్యేక దర్శనం కోసం పోటెత్తుతున్నారు. భక్తులు ఉపవాస దీక్షలు చేసి, బిల్వ దళాలతో పూజలు నిర్వహిస్తూ శివుని కృప కోసం పూజలందుకుంటున్నారు. ప్రదోష దర్శనం ఒక్క సారైనా పొందితే జన్మ సార్థకమవుతుందని భక్తులు అంటున్నారు. ఇలా ప్రదోష వేళలో శ్రీశైలంలో నెలకొనే భక్తి వాతావరణం, ఆధ్యాత్మిక ఉత్సాహం ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తూ, ఆ క్షణాలను మరింత పవిత్రంగా నిలుపుతుంది.

# అపరాల సాగులో రైతుల మెళుకువలు పాటించాలి - ఎఒ



**అద్దంకి , మార్చి 23, ప్రభాతవార్త**

అపరాల సాగులో మెళుకువలు పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. ఆత్మ నిర్భరతా భారత్, జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార పథకంలో భాగం గా మణికేశ్వరం రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమం లో వ్యవసాయాధికారి మాట్లాడుతూ సాగులో విత్తన ఎంపిక కీలకమని సూచించారు. నంద్యాల శనగ రకాలు అధిక దిగుబడులు ఇస్తున్నాయని సూచించారు. ప్రతి రైతు ఎపిఎఐఎంఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడం వలన వ్యవసాయ సూచనలు, వాతావరణ సూచనలు తెలుసుకోవచ్చని తెలిపారు కార్యక్రమం లో మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, గుడిపూడి బ్రహ్మయ్య, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగత్‌సింగ్, బేబీ శ్రీధర్‌ల వర్ధంతి



**సంతమాగులూరు, మార్చి 23,ప్రభాతవార్త**

సీపీఐ సంతమాగులూరు మండల సమితి ఆధ్వర్యంలో ఉద్యమ కెరటాలు, యువతకు స్ఫూర్తి ప్రదాతలు భగత్ సింగ్, జేబీ శ్రీధర్ వర్ధంతి సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏల్చూరులోని భగత్ సింగ్ కాలనీలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు షేక్.ముస్తఫా అధ్యక్షతన భగత్ సింగ్, శ్రీధర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ బ్రిటీష్ వారి వెన్నులో వణుకు పుట్టించి, చిన్న వయసులోనే ఉరికొయ్యను ముద్దాడిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ అన్నారు. అదేవిధంగా బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, సీపీఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కామ్రేడ్ జల్దీ భాగ్యరాజ్ శ్రీధర్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, వారి జీవనశైలిలో మార్పుకోసం పరితపించారని, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆ మహనీయులు స్ఫూర్తితో రానున్న రోజుల్లో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోరాటాలు ఉదృతం చేస్తామని ప్రతినబూనారు. ఈకార్యక్రమంలో బాపట్ల జిల్లా మహిళా సమాఖ్య కోకన్వీనర్ మేకల వెంకాయమ్మ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మేకల రమణయ్య, సీనియర్ నాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, అంజమ్మ, హుస్సేనమ్మ, విద్యార్థి సంఘం తరఫున బ్రూలా, విజయ్, అనిల్, భాగ్యలక్ష్మి, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం

## - పాల్గొన్న మంత్రి గొట్టిపాటి



**అద్దంకి , మార్చి 23,ప్రభాతవార్త**

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉగాది పర్వదినము 19వ తేదీ నుండి 23వ వరకు జరుగుతున్న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా అద్దంకి పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల లోని బాలబాలికలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర విద్యుత్ శాఖ గొట్టిపాటి రవికుమార్, అద్దంకి ఆర్‌డిఒ జాన్సన్, అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, దర్శి డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ, తహశీల్దార్ శ్రీచరణ్, సింగరకొండ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చుండూరు మురళి సుధాకర్ రావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా చిన్నారులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ అక్షరాభ్యాసం చేయించారు. స్టేట్ కోఆర్డినేటర్ సందిరెడ్డి కొండలరావును తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు 21 స్కూటర్‌లు అందజేసిన మంత్రి గొట్టిపాటి

## - అద్దంకిలో 196 మందికి ట్రై స్కూటర్‌లు ఇప్పటికే పంపిణీ

## - మంచి పనులకు దాతలు ముందుకు రావాలని మంత్రి పిలుపు



**అద్దంకి , మార్చి 23, ప్రభాతవార్త**

సమాజంలో మంచిపనులు చేసేందుకు దాతలు ముందుకు రావాలిని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయ అవరణలో 21మంది దివ్యాంగులకు ట్రై స్కూటీలను మంత్రి అందజేశారు. దాతలైన పెద్ది సినీమా నిర్మాత కిలారు వెంకట సతీష్ ప్రొడక్షన్ హౌస్ అయిన వ్రిద్ధి సినిమాస్ సహకారంతో ఈ స్కూటర్‌లను అందజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో విద్యార్థులకు ఇప్పటికే 10,000కు పైగా సైకిళ్లను ఉచితంగా అందించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఇప్పటికీ 196మందికి ట్రై స్కూటర్‌లను ఉచితంగా అందించినట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగ నోటిఫికేషన్



**ఒంగోలు ,మార్చి 23, ప్రభాతవార్త**

2026 వ సంవత్సరంలో దివ్యాంగుల బ్యార్బాగ్ ఉద్యోగ పోటిఫికేషన్ వారీ చేయుటకు గాను రాష్ట్ర ప్రభుత్వం వారు తేది: 31.03.2016 తుది గడువుగా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. అందుకు సంధించినటువంటి విధి దాన్ని కూడా తవరి ఆధ్వర్యంలో సాదర్శకంగా జరిగే విధముగా తనరు అధికారులను ఆదేశించమని ద్యిగుల బ్యాక్ ఉద్యోగుల నోటిఫికేషన్‌ను ఎప్పటిలాగే ఆన్‌అప్లికేషన్ విధానంలో ధరఖాస్తులను స్వీకసించాలని తమరిని కోరియున్నాము. దివ్యాంగశాఖ వారు ఆన్లైన్ విధానంలోనే దరఖాస్తులను స్వీకరిస్తు ఆన్లైన్ విధానాన్ని విస్మరిస్తున్నారు. సుమారుగా గత 5 నోటిఫికేషన్లు అన్ని కూడా ఆన్లైన్ అప్లికేషన్ విధానాన్నే అనుసరించి పారదర్శకంగా నిర్వహించినప్పటికి మరలా ఇప్పుడు ఆఫ్ లైన్ విధానానికి వెళ్ళడం వలన నదరు విధానము అనేక ఆనుమాలకు చావు ఇచ్చినట్లుగా అవుతున్నది.పై విషయములన్ని కూడా తమరు దృష్టిలో వుంచమని ఎటువంటి అవకతవకలు లేకుండా జరిగేలాగువు తమది ఆధ్వర్యంలో స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ఫర్ డిజాబిల్ట్ కమిటీ పని చేసే లాగా చర్యలు తీసుకొనవలసినదిగా తగు చర్యలు చేసుకొనవలసినదిగా తను ఘనమును మిక్కిలిగా ప్రార్థించుచున్నాము.

